ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 26 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 10 మే 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన

## కొత్త నియామకాలపై అధిష్టానం ఫోకస్!

**ప్రస్తుతం కేరళం, తమిళనాడు ప్రభుత్వాల ఏర్పాటు ప్రక్రియలో కాంగ్రెస్ అధిష్టానం బిజీ**



**హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం)**

ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం కేరళం, తమిళనాడు ప్రభుత్వాల ఏర్పాటు ప్రక్రియలో బిజీగా ఉన్నది. తమిళనాడులో రాజకీయాలు కొలిక్కి రాగానే.. ఒకటీ, రెండు రోజుల్లో కేరళంలో సీఎం ఎంపిక ప్రక్రియ పూర్తి కానుంది. ఆ తర్వాత ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలపైనే మొత్తం ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. దీంతో త్వరలో పలు కీలక మార్పులు జరగొచ్చనే చర్చ జరుగుతున్నది. మంత్రివర్గ ప్రక్షాళన, పలువురు మంత్రుల శాఖల తొలగింపు, అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వర్కింగ్ ప్రెసిడెంట్స్ నియామకం ఉంటుందని ప్రచారం జరుగుతున్నది.

**త్వరలో ఢిల్లీలో కీలక మీటింగ్..**

త్వరలో ప్రభుత్వం, పార్టీని గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ అధిష్టానం నడుం బిగించినట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్రానికి చెందిన కీలక నేతలకు సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్నది. కేరళం, తమిళనాడు ప్రభుత్వాల ఏర్పాటు తర్వాత ఏఐసీసీ నేతలు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఢిల్లీకి పిలిచి పార్టీ, ప్రభుత్వంలో జరిగే మార్పులపై అభిప్రాయాలను తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రధానంగా పలు నివేదికల ఆధారంగా పనితీరు సరిగా లేని మంత్రులను కేబినెట్ నుంచి తొలగించి, ఆ స్థానాల్లో కొత్త వారిని నియమించేందుకు అధిష్టానం మొగ్గు చూపుతున్నది. దీంతో ఎవరిని తొలగించాలి? ఎవరిని కేబినెట్ లోకి తీసుకోవాలి? అనే అంశంపై నేతల ఒపీనియన్ తీసుకుని, అధిష్టానం ఆలోచన ఏమిటో కూడా వివరించే అవకాశం ఉంది. అలాగే పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా సూచనలు చేయొచ్చని తెలుస్తున్నది.

**మంత్రి పదవికి బదులుగా పార్టీ పదవులు**

మంత్రివర్గం నుంచి తొలగించిన ఎమ్మెల్యేలను ఖాళీగా ఉంచితే, సదరు నేతలను అవమానపరిచారంటూ ఆయా సామాజిక వర్గాల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే అవినీతికి పాల్పడ్డారనే కారణంతోనే మంత్రివర్గం నుంచి పక్కన పెట్టారనే విమర్శలు విపక్షాల నుంచి రావడం ఖాయం. అందుకని మంత్రివర్గం నుంచి తప్పించి, పార్టీ పరంగా కీలక పదవులు ఇవ్వాలనే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు టాక్. అందులో భాగంగా కొందరికి ఏఐసీసీ, పీసీసీ పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

**శాఖల మార్పు తథ్యం**

ప్రస్తుతం ఒక్కో మంత్రి వద్ద రెండేసి కీలక శాఖలు ..మిగతా 2లో



## బెంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ
# సాష్టాంగ నమస్కారం

**పశ్చిమ బెంగాల్‌లో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు**

**ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారి**

**రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, మే 9 (ప్రభాత ఉదయం)**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి అపూర్వ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ వినమ్రంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం, సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం చారిత్రక ఘట్టం. ఈ సందర్భంగా వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేసిన ప్రధాని, ఆ తర్వాత సాష్టాంగ నమస్కారం చేశారు. ఈ దృశ్యం కార్యక్రమానికి హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుంది. కోల్‌కతాలోని ప్రఖ్యాత బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారితో పాటు మరో ఐదుగురు మంత్రులతో ప్రమాణం చేయించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీ 207 సీట్లు గెలుచుకుని, 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికింది.

ఈ విజయం బీజేపీకి ఎంత ముఖ్యమో చెప్పడానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ కార్యక్రమానికి స్వయంగా హాజరు కావడమే నిదర్శనం. ఎన్నికలకు ముందు వీరిద్దరూ బెంగాల్‌లో విస్తృతంగా పర్యటించి, భారీ రోడ్‌షోలు, ర్యాలీలతో ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే. వారి కృషి ఫలించి, బెంగాల్ ..మిగతా 2లో

# తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం..



## 17 లైసెన్స్ సేవలు ఇక ఆన్‌లైన్‌లోనే!

**ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లకుండానే లైసెన్స్ సేవలు**

**ఆధార్‌తో ఇంటి నుంచే లైసెన్స్ పనులు పూర్తి చేసుకునే అవకాశం**

**లైసెన్స్ రెన్యూవల్, డూప్లికేట్ వంటి కీలక సేవలు ఆన్‌లైన్‌లోనే**

**త్వరలో 'నెక్స్‌జెన్ ఎం-పరివాహన్' యాప్‌లోనూ ఈ సేవలు**

**హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలోని వాహనదారులకు రాష్ట్ర రవాణా శాఖ భారీ ఊరట కల్పించింది. డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన 17 రకాల సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తూ 'ఫేస్‌లెస్' విధానాన్ని ప్రారంభించింది. ఇకపై చిన్న చిన్న పనుల కోసం ఆర్టీవో కార్యాలయాల చుట్టూ గంటల తరబడి తిరగాల్సిన అవసరం లేదని, ఆధార్ ధ్రువీకరణ ద్వారా ఇంటి నుంచే ఈ సేవలను పొందవచ్చని రవాణా శాఖ ..మిగతా 2లో



**ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో**
# మరిన్ని సవాళ్లు

**పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ప్రకటన**

**రాష్ట్రాన్ని 3భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని వెల్లడి**

**హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం)**

ఔటర్ రింగ్ రోడ్డు వరకు కోర్ అర్బన్ రీజియన్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు.. ఆధునీకరణ, నగరీకరణతో సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి వివరించారు. పెరుగుతున్న నగరీకరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ రద్దీ లేని నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌ల వంటి మూడు విధానాల్లో ట్రాఫిక్‌కు సులభతరమైన రవాణా మార్గాలను కల్పించే విధానాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ..మిగతా 2లో

# ఓబీసీ కులగణనపై వీహెచ్ నిరవధిక నిరాహార దీక్ష షురూ



**హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం)**

జనగణనలో బీసీ కులాల గణన చేపట్టాలన్న డిమాండ్‌తో ప్రభుత్వ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంత రావు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. అంబర్‌పేటలోని తన నివాసంలో శనివారం దీక్ష ప్రారంభించారు. రాజకీయ పార్టీలకి అతీతంగా బీసీల అభ్యున్నతికి, బీసీ జనాభా ప్రతిపాదికంగా న్యాయం జరగాలంటే జనగణనలో బీసీ జనాభా కూడా లెక్కించాలి వీహెచ్ డిమాండ్ చేస్తున్నారు. జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని ఈ విషంలో ఈ నెల 8వ తేదీలోపు స్పష్టత ఇచ్చిన తర్వాతే ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటకు రావాలని ఇటీవల మీడియాతో ..మిగతా 2లో

# కాంగ్రెస్ అంటేనే కరప్షన్..

**తుమ్మిడిహెట్టిపై అసత్య ప్రచారాలు : హరీష్ రావు ఫైర్**

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.**

2లో..






## బీఆర్ఎస్‌పై కవిత
# తీవ్ర ఆరోపణలు

**గుంటనక్క కమీషన్లు మింగేసింది..**

**ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ కమీషన్లు దండుకుందన్న కవిత**

**రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని ఆరోపణ**

**రేవంత్ ప్రభుత్వం కూడా బిల్లులు చెల్లించి కమీషన్లు తీసుకుందన్న టీఆర్ఎస్ చీఫ్**

**దసరాలోపు పనులు మొదలుపెట్టకపోతే పాదయాత్ర చేస్తానని హెచ్చరిక**

**అధికారంలోకి వస్తే 10 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని హామీ**

**హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం)**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని, కమీషన్ల కోసం ప్రాజెక్టును బలిపెట్టాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ..మిగతా 2లో

# కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి...

ఉన్నాయి. రెండున్నరేళ్లుగా మంత్రులు ఆ రెండు శాఖలను పర్యవేక్షిస్తూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నట్లు టాక్ ఉంది. అయితే, కొందరు మంత్రులు తమకు కేటాయించిన శాఖల్లో ఆశించిన స్థాయిలో పనితీరు కనబర్చలేదని, మరికొందరు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు అధిష్టానానికి ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో సంబంధిత మంత్రుల నుంచి ఆయా శాఖలను తొలగించి, ఇతర శాఖలను కేటాయించడమో, లేకపోతే ఒక శాఖకే పరిమితం చేయడమో జరుగుతుందని తెలిసింది.



**పూర్తిస్థాయి కేబినెట్ ఏర్పాటుకు కసరత్తు**

త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత కోర్ అర్బన్ ఏరియాలోని మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలిసింది. ఈ ఎన్నికలకు ముందు పూర్తి స్థాయి కేబినెట్ ఏర్పాటు చేసి, అందరికి గెలుపు బాధ్యతలు అప్పగించాలనే యోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. అందులో భాగంగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులు, చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను ఒకేసారి భర్తీ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ నాలుగు పదవులకు కేబినెట్ హోదా ఉంటుంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాలను సమన్యాయం చేయొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిసింది.

**ప్రభుత్వం, పార్టీ మధ్య గ్యాప్**

ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తయింది. కానీ, ఇప్పటికి కూడా ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. విపక్షాలు చేసే విమర్శలు, ఆరోపణలకు దీటుగా సమాధానం ఇవ్వడంలో నేతలు ఆసక్తి చూపడం లేదని టాక్. ఈ జాబితాలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు ఉన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పైరవీల కోసం కేటాయించే సమయంలో పదో వంతు టైమ్ పార్టీ కేడర్‌ను కలిసేందుకు కూడా కేటాయించడం లేదనే ఫిర్యాదులు ఢిల్లీకి చేరినట్లు ప్రచారం ఉంది. దీంతో పార్టీ, ప్రభుత్వం మధ్య కొనసాగుతున్న గ్యాప్‌ను పూరించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే అవకాశం ఉంది.

**వర్కింగ్ ప్రెసిడెంట్స్ నియామకం**

చాలా కాలంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ నియామకం వాయిదా పడుతున్నది. దీంతో పార్టీ యాక్టివిటీస్ స్పీడప్ కావడం లేదనే వాదనలు ఉన్నాయి. అందుకని నలుగురు లీడర్లకు వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఇవ్వాలని అధిష్టానం భావిస్తున్నది. ఎస్టీ సామాజిక వర్గం నుంచి బలరాం నాయక్, ఎస్సీ సామాజిక వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి/రోహిణ్ రెడ్డిల్లో ఒకరికి, ఒక మహిళా నేతకు వర్కింగ్ ప్రెసిడెంట్స్ పదవులు ఇచ్చే అవకాశం ఉంది.

# ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని సవాళ్లు

మొదటి పేజీ తరువాయి...

నియంత్రణ కోసం కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే చేపడితే సరిపోదని బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు పెరి అర్బన్ రీజియన్ ఎకానమి (ప్యూర్) ప్రాంతాన్ని మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామన్నారు. రింగ్ రోడ్డు బయట ఉన్న రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా వ్యవసాయం, దానిక అనుబంధ రంగాలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలను సిద్ధం చేశామని సమావేశంలో సీఎం తెలిపారు.



ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ 2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకొని లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం అన్నారు. కాలుష్య కోరల నుంచి హైదరాబాద్‌ను కాపాడటానికి మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర సంస్కృతికి అనుసంధానించబోతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరంలో కాలుష్య నియంత్రణకు పలు చర్యలు తీసుకుంటున్నామని, ప్రవేశపెడుతున్నామని కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చాలన్న సంకల్పంతో పనిచేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ నగర తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రణాళికలను సమావేశంలో ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాండింగ్ కమిటీకి వివరించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వం స్టాండింగ్ కమిటీని కోరింది.

రాష్ట్రంలో మహిళాభివృద్ధి : మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టడం ఒక విప్లవాత్మక నిర్ణయమని స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్‌తో పాటు ఇతర సభ్యులు అభినందించారు. హైదరాబాద్ నగర జీవన స్థితిగతులను మెరుగుపరిచే మూసీ పునరుజ్జీవ తరహా ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని కమిటీ సభ్యులు అన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు కీలకమైన మూసీ ప్రాజెక్టు, రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై స్టాండింగ్ కమిటీ ప్రశంసించింది. స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులను ముఖ్యమంత్రి సత్కరించారు.

# కాంగ్రెస్ అంటేనే కరప్షన్..

**తుమ్మిడిహెట్టిపై అసత్య ప్రచారాలు : హరీష్ రావు ఫైర్**

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.**

**హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం)**

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్‌కు మరో పేరని ఆరోపించిన ఆయన.. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. తుమ్మిడిహెట్టి వద్ద రూ.11 వేల కోట్ల పనులు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుండటం పూర్తిగా అవాస్తవమని హరీష్ రావు విమర్శించారు. మరోవైపు ప్రాజెక్టుపై ఒప్పందం కుదిరిందని మంత్రులు చెబుతుండగా.. సీఎం మాత్రం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒప్పందం కుదిరేలా చూడాలని లేఖ రాశారని చెప్పడం ప్రభుత్వ వైఖరిలోని



గందరగోళాన్ని బయటపెడుతోందన్నారు. 150 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ఒప్పందం కుదరలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టుపై ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతోందని, కాంగ్రెస్‌కు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదని హరీష్ రావు ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని ఉపయోగించుకుంటోందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న కాంగ్రెస్.. మహారాష్ట్రతో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్తున్నా.. ఇప్పటి వరకూ ఎందుకు ఒప్పందం కుదుర్చుకోలేకపోయిందని ప్రశ్నించారు.

గతంలో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా రూ.2300 కోట్ల బిల్లులు ఎత్తేశారని, మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద మంత్రులు హడావిడి చేయడం తప్ప అసలు పనిలో పురోగతి కనిపించడం లేదని, 'పని తక్కువ.. ప్రచారం ఎక్కువ' అన్నట్టుగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. 30 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కోసం ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ చెప్పిన మాటలు పచ్చి అబద్ధాలని విమర్శించిన హరీష్ రావు.. ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకున్నది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ నేతలు సోయి లేకుండా మాట్లాడుతున్నారని, ప్రజలను మభ్యపెట్టేందుకు డ్రామాలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# దీనబంధు కాలనీలో వైయస్సార్ విగ్రహాన్ని ఢీకొట్టిన కారు

**దెబ్బతిన్న వైఎస్ఆర్ విగ్రహం... ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్ఆర్ అభిమానులు**

**కూకట్ పల్లి, మే 9 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని దిన బంధు కాలనీ చౌరస్తాలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని శనివారం గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో వైయస్సార్ అభిమానులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ ఘటనపై జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో వైయస్సార్ అభిమానుల ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ వెంకటేశం వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సిసి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు జరిపి వైయస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ అభిమాని ఆనంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందుల శివకుమార్, శ్రీధర్ పటేల్, ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాచర్ల విష్ణు, ఎస్ పరశురాం, బాలు వైయస్సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం..

మొదటి పేజీ తరువాయి...

కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి తాజాగా ఒక ప్రకటనలో తెలిపారు. పారదర్శకతను పెంచడం, సేవలను వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.


ఈ కొత్త విధానం ద్వారా లెర్నర్ లైసెన్స్‌లో పేరు, చిరునామా, ఫొటో, సంతకం మార్పులు, డూప్లికేట్ లెర్నర్ లైసెన్స్ జారీ వంటివి సులభంగా చేసుకోవచ్చు. అలాగే, అత్యంత కీలకమైన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, డూప్లికేట్ లైసెన్స్, లైసెన్స్ రీప్లేస్‌మెంట్, పుట్టిన తేదీ మార్పు, బయోమెట్రిక్ వివరాల సవరణ వంటి సేవలను కూడా ఫేస్‌లెస్ పద్ధతిలో అందిస్తున్నారు. ఈ సేవలను పొందడానికి పౌరులు అధికారిక 'సారథి' వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చు.

వీటితో పాటు ప్రమాదకర వ్యర్థాల రవాణాకు అవసరమైన హజార్డస్ లైసెన్స్ ఎండార్స్‌మెంట్, డూప్లికేట్ పబ్లిక్ సర్వీస్ వెహికల్ (పీఎస్‌వీ) బ్యాడ్జ్ జారీ, లైసెన్స్ నుంచి ఏదైనా వాహన విభాగాన్ని తొలగించడం వంటి సేవలు కూడా ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయి. రాష్ట్రంలో డిజిటల్ పాలనను పటిష్ఠం చేయడంలో భాగంగా, మధ్యవర్తుల ప్రమేయాన్ని పూర్తిగా నిర్మూలించి, పౌరులకు పారదర్శకమైన సేవలు అందించడమే ఈ ఫేస్‌లెస్ విధానం యొక్క ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రస్తుతం వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉన్న ఈ సేవలను త్వరలోనే 'నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్' మొబైల్ యాప్‌లోనూ తీసుకురానున్నట్లు కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. దీనివల్ల స్మార్ట్‌ఫోన్ ద్వారా ఎక్కడి నుంచైనా సులభంగా పనులు పూర్తి చేసుకోవచ్చు. కార్యాలయాలపై పని భారాన్ని తగ్గించడంతో పాటు, ప్రజలకు సమయం, శ్రమ ఆదా కావాలనే ఉద్దేశంతో ఈ విప్లవాత్మక మార్పులు చేసినట్లు రవాణా శాఖ పేర్కొంది. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

# బీఆర్ఎస్‌పై కవిత తీవ్ర ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి...



అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్-చౌదరిగూడలో శుక్రవారం నిర్వహించిన 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ'లో ఆమె మాట్లాడారు. ఆంధ్రోళ్లను తిట్టి ఓట్లు దండుకున్న బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడిందని విమర్శించారు.

"ప్రాజెక్టు కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేసినా కనీసం 33 ఎకరాలకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం నీరు అందించలేకపోయింది. ఓ గుంటనక్క కమీషన్ల కోసం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రాజెక్టు డిజైన్ మార్చింది. జూరాల నుంచి శ్రీశైలానికి సోర్స్ పాయింట్ మార్చడం క్షమించరాని నేరం" అని కవిత మండిపడ్డారు. ఈ మార్పు వల్లనే ఆంధ్రప్రదేశ్‌తో వివాదాలు తలెత్తుతున్నాయని అన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. 'నల్లమల పులి బిడ్డ'నని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు పనుల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఎద్దేవా చేశారు. కానీ, ప్రాజెక్టు పేరుతో రూ.6 వేల కోట్ల బిల్లులు చెల్లించి కమీషన్లు తీసుకున్నారని, ఇందులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కూడా వాటా ఉందని సంచలన ఆరోపణలు చేశారు. దసరాలోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేసి కాంగ్రెస్‌ను ఎండగడతామని హెచ్చరించారు.

తాము అధికారంలోకి వస్తే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కింద 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని కవిత హామీ ఇచ్చారు. నీటి పారుదలపై వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేలా ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

# బెంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ సాష్టాంగ నమస్కారం

మొదటి పేజీ తరువాయి...

రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. సువేందు అధికారి నేతృత్వంలోని తొలి మంత్రివర్గంలో సామాజిక సమతుల్యతకు బీజేపీ పెద్దపీట వేసినట్లు కనిపిస్తోంది. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో దిలీప్ ఘోష్ (ఓబీసీ), అగ్నిమిత్ర పాల్ (కాయస్థ), అశోక్ కీర్తానియా (మథువ), క్షుదీరామ్ తుడు (గిరిజన తెగ), నిషిత్ ప్రామాణిక్ (రాజ్‌బొంగ్షి) వంటి వివిధ వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించారు. పార్టీ బలోపేతానికి, చారిత్రక విజయానికి కృషి చేసిన ఈ నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించడం ద్వారా పార్టీ వారికి సరైన గుర్తింపునిచ్చింది.

# ఓబీసీ కులగణనపై వీహెచ్ నిరవధిక నిరాహార దీక్ష షురూ

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడుతూ వీహెచ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీక్షకు దిగుతానని హెచ్చరించారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ఇవాళ్టి నుంచి ఆయన దీక్షకు దిగారు. తాను ప్రధానికి పలుమార్లు లేఖలు రాసినా సరైన స్పందన లేకపోవడంతో దీక్ష చేపట్టినట్లు ఈ సందర్భంగా వీహెచ్ తెలిపారు.

# ప్రధాని నరేంద్రమోడీ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలి: మేకల వనితారెడ్డి



మేకల వనిత రెడ్డి



బుద్వేల్ లో బైక్ ర్యాలీ ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్



ఉప్పర్ పల్లి లో కరపత్రాలను పంచి ప్రధాని సభకు రావాలని కోరుతున్న బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి

**బుద్వేల్, మే 9 (ప్రభాత ఉదయం):**

పెరెడ్ గ్రౌండ్ లో ఆదివారం జరుగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో విజయం సాధిస్తుందన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మెజారిటీ రాష్ట్రాలలో విజయం సాధించడం వెనుక మోడీ కృషి ఎంతగానో ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో తెలంగాణ లో బీజేపీ విజయం సాధించడానికి ప్రధానమంత్రి మోడీ బహిరంగ సభ నాంది పలుకబోతుందన్నారు. బీజేపీ నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో బహిరంగ సభ కు హాజరై విజయవంతం చేయాలన్నారు.

**ప్రధాని సభ ను విజయవంతం చేయాలని బుద్వేల్ నుంచి సైకిల్ ర్యాలీ :**

రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ యువ మోర్చా అధ్యక్షులు రాపర్తి రాకేశ్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం బుద్వేల్ నుంచి శివరాంపల్లి, ప్రేమావతిపేట్, రాజేంద్రనగర్ బస్తీలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభ ను విజయవంతం చేయాలన్నారు. ఈ ర్యాలీని గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జి వై.శ్రీధర్ ప్రారంభించారు. ర్యాలీలో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పసుపుల సందీప్ ముదిరాజ్, కోరని సదానంద్, జి బాబురావు, కోరని క్రాంతి, హరికిషన్, బండారి బాలక్రిష్ణ, పి రవీందర్, సదాల రాజశేఖర్ రెడ్డి , సరితారెడ్డి, పద్మావతి, యాదయ్య, గోపాల్ ముదిరాజ్, బాలు, కిరణ్, సందీప్ చారి తదితరులు పాల్గొన్నారు.

**ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలి : బొక్క బాల్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల లక్ష్యంగా ఆదివారం పెరెడ్గ్రౌండ్స్ లో జరుగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభ ను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి అన్నారు. ఇదే విషయమై శనివారం ఉప్పరపల్లి పరిసర కాలనీలు, బస్తీలలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో తిరిగి ప్రచారం చేశారు. వివిధ కాలనీల ప్రెసిడెంట్లు, విశ్రాంత ఉద్యోగులు, కుల సంఘాల పెద్దలకు ప్రత్యేక ఆహ్వానితులకు ఇచ్చే పాస్ లను ఇచ్చి వారిని ఆహ్వానించారు. కాలనీల్లో పోస్టర్లు వేయడం తో పాటు ఇంటింటికి వెళ్లి మోదీ బహిరంగ సభ గురించి వివరిస్తున్నారు. కార్యక్రమం లో సీనియర్ నాయకులు సులిగె విఠల్, శ్రీకాంత్ రెడ్డి , పవన్, పలుగుచెరువు నరేందర్, వి భూపాల్ మ దిరాజ్, సన్న మనోజ్, కె నవీన్, సాయి మనోజ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

**30బస్సులు, 150 కార్లలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సభకు వెళ్లనున్న మైలార్దేవుపల్లి నాయకులు :**

మైలార్దేవుపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యం లో ఆదివారం పెరెడ్ గ్రౌండ్స్ లో జరుగనున్న బహిరంగ సభకు మూడు వేల మందితో బయలుదేరనున్నట్లు ఆయన తెలిపారు. మైలార్దేవుపల్లి లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోడీ మూడవ సారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక మొదటి సారిగా నగరానికి వస్తున్న నేపథ్యంలో డివిజన్ నుంచి మూడు వేల మందిమి తరలివస్తామన్నారు. అందుకోసం 30 బస్సులు, 150 కార్లను ఉపయోగిస్తు బి న్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడికె జనార్ధన్, సి బుచ్చిరెడ్డి, బబ్లు, ఎల్.వి రెడ్డి, పృథ్వీరాజ్, బొల్ల రామక్రిష్ణ, క్రిష్ణ, జయంతి, అంజమ్మ, ఎం డి షకీల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ ప్రజలు ప్రధాని నరేంద్రమోడీకి అండగా నిలబడాలి : వై.శ్రీధర్**

గడిచిన 12 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రూ. 13లక్షల కోట్ల రూపాయలను విడుదల చేశారని బీజేపీ గోల్కొండ గోషామహల్ నియోజకవర్గాల ఇంచార్జి వై.శ్రీధర్ అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు విస్తరించాయని, కొత్త లైన్లు, రైల్వే స్టేషన్ల ల అధునీకరణ తో రైల్వేలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఏర్పడ్డాయన్నారు. విద్యాసంస్థల్లో మౌళిక సదుపాయాలు పెరిగాయి. అనేక రంగాలు అభివృద్ధి చెందడానికి కారకులౌతున్న ప్రధాని నరేం ద్రమోడీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు చేయి చేయి కలిసి ముందుకు రావాలన్నారు.



వై శ్రీధర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

# రహదారులపై బైక్ స్టంట్లు, ప్రమాదకర డ్రైవింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు యువకుల అరెస్ట్





బైక్ లపై స్టంట్‌లు చేస్తున్న యువకులు



పోలీసుల అదుపులో యువకులు

**బుద్వేల్, మే 9 (ప్రభాత ఉదయం)**

బహిరంగ రహదారులపై ప్రాణాపాయం కలిగించే విధంగా బైక్ స్టంట్లు చేస్తు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్న ఆరుగురు యువకులను రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, అత్తాపూర్ పోలీసులు కలసి శనివారం అరెస్ట్ చేశారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు వివరాలు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా మధ్య ప్రధాన రహదారులపై కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నట్లు పోలీసులకు దృష్టికి వచ్చింది. వీరు కేవలం తమ ప్రాణాలనే కాకుండ, పాదచారులు, ఇతర వాహనదారుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ట్రిపుల్ డ్రైవింగ్, జిగ్ జాగ్ డ్రైవింగ్ లు చేస్తు వాహనాల నుంచి నిప్పు రవ్వలు వచ్చేలా రాపిడి చేస్తు వీరంగం సృష్టిస్తున్నారు. అత్తాపూర్ పోలీసులు దాడులు నిర్వహించి హసన[illegible]నగర్ కు చెందిన సయ్యద్ షాహెద్ (19), షేక్ నసీర్ హుస్సేన్ (19), షేక్ జునైద్ (18), కాలపత్తర్ కు చెందిన మహ్మద్ బిన్ ఈసా (17), అబ్దుల్ సమద్ (20), ఎన్టీఆర్ నగర్ కు చెందిన మహ్మద్ అర్బాజ్ హుస్సేన్ ఖాన్ (22) లను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, రెండు స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గంలో క్రైస్తవుల సమాధుల కోసం
# 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి

**బుద్వేల్, మే 9 (ప్రభాత ఉదయం)**

క్రైస్తవ సమాజానికి అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని, అదే సమయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో క్రైస్తవుల సమాధుల కోసం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ కె సుందర్ పాల్ అన్నారు. శనివారం శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో గల రాజేం ద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.క్రైస్తవ సమాజం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించిందన్నారు. మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలలో అడ్మిషన్లు ఇప్పించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం 100 మంది క్రైస్తవ విద్యార్థులకు రూ.20లక్షల చొప్పున ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇసు న్నారని గుర్తు చేశారు. చర్చిల నిర్మాణం, పునరుద్ధరణ కోసం నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కొనియాడారు. క్రైస్తవ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తు వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నారన్నారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణ కోసం ప్రతి చర్చికి రూ.30 వేల చొప్పున కేటాయించడం, మండలానికి ఏడు చొప్పున ప మంది చర్చిలకు చెందిన పది గ్రూపులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు కేటాయించి క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకునేలా ప్రోత్సహాన్ని అందిను చేస్తున్న ప్రభుత్వం రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని క్రైస్తవుల సమాధుల తోట ( శ్మశానవాటిక) ల కోసం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నామన్నారు. హెచ్ఎండీఏ పరిమితుల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని కోరుతున్నామన్నారు. సమాధుల తోట కు స్థలాలు లేక చాలా చోట్ల ఇబ్బందులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుని క్రైస్తవులకు మేలు చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ప్రణీత్ బాబు, కోశాధికారి రెవరెండ్ బట్టు శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి పాస్టర్ సోమారం రాజ్ కుమార్, కమిటీ సభ్యులు బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేల్, పాస్టర్లు జాన్ వెస్లీ, క్రైస్తవ సంఘాల నాయకులు ఆర్ శ్రావణ్ కుమార్, నందిగామ నర్సిం హ్మా, బ్రదర్ జాన్, పాస్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





విలేకరుల సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల పాస్టర్లు, నాయకులు



# ధర్మారెడ్డి కాలనీలో ఘనంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

**సామాజిక బాధ్యతతో ఈ శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయ**

**టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**

**కూకట్‌పల్లి, మే 9 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్ పరిధిలోని ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-2లో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో, బండి రమేష్ సహకారంతో, మాకినేని యాకనారాయణ (వినోద్) - విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం అత్యంత విజయవంతంగా ముగిసింది. కూకట్‌పల్లిలోని వివిధ కాలనీల నుండి సుమారు 230 మంది ప్రజలు తరలివచ్చి ఈ ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు.

**వైద్య సేవలపై ప్రశంసలు**

బసవతారకం ఆసుపత్రి వైద్య బృందం రోగులకు ఓపికగా పరీక్షలు నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేస్తూ అందించిన సేవలు ప్రజల మన్ననలు పొందాయి. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మాకినేని యాకనారాయణ (వినోద్)ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్ రెడ్డి, తుమ్మ వేణు, చావ శ్రీనివాస్, కిలారు శ్రీనివాస్ బాబు, కామినేని వాసు, సాయితులసి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సేవా కార్యక్రమాల కొనసాగింపుగా, ఈ నెల 17వ తేదీన భగత్ సింగ్ నగర్ ఫేజ్-2, వినాయక మండపం వద్ద జరగనున్న రెండవ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మాకినేని వినోద్ మాట్లాడుతూ ఈ శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన ధర్మారెడ్డి కాలనీ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాలనీ వాసులకు, బసవతారకం ఆసుపత్రి యాజమాన్యానికి, వాలంటీర్లకు ధన్యవాదాలు తెలియజేస్తూ.. భవిష్యత్తులో కూడా మీ అందరి ఆశీస్సులు ఉండాలని కోరారు.

# ఈనెల 11నుంచి విద్యా వారోత్సవాలు నిర్వాహణ

**రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె.శంకర్**

**రాజేంద్రనగర్,మే09(ప్రభాత ఉదయం)**



విద్యాశాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండపరిధిలో ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కె.శంకర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...11వ తేదీన ఫౌండేషన్ డే కార్యక్రమాలు,12వ తేదీన పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల కోసం రివిజన్ కార్యక్రమాలు,13వ తేదీన నియోజకవర్గ స్థాయిలో పాఠశాల విద్య నిర్వహణపై సర్పంచ్‌లకు సదస్సు,14వ తేదీన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం,15వ తేదీన గ్రంథాలయ నిర్వహణ కార్యక్రమాలు,16వ తేదీన ఆర్ట్స్ అండ్ కల్చరల్ కార్యక్రమాలు,17వ తేదీన విద్యార్థుల విజయోత్సవాలు,మండలంలోని ప్రజాప్రతినిధులు,యువజన సంఘాలు,విద్యార్థి సంఘాల నాయకులు,తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## హిందూ దేవాలయాలపై
# జీఎస్టీ రద్దు చేయాలి

**భక్తుల మనోభావాలను గౌరవించాలి : కాంగ్రెస్ నాయకుడు గాదె శివ**

**కూకట్‌పల్లి, మే 9 (ప్రభాత ఉదయం)**



హిందూ దేవాలయాల్లో దర్శనం, అర్చనలు, కొబ్బరికాయలు కొట్టడం వంటి ఆధ్యాత్మిక ఆచారాలపై జీఎస్టీ లేదా ఇతర పన్నులు విధించడం పట్ల భక్తుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదె శివ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “మోడీ సార్, హిందూ దేవాలయాల్లో దర్శనం, అర్చనలు, కొబ్బరికాయలు కొట్టడంపైనా పన్నులు వేస్తే సాధారణ భక్తుడు ఎలా భక్తి చేయగలడు? హిందూ సోదరుల మనోభావాలను గౌరవించి దేవాలయాలపై జీఎస్టీ విధానాన్ని పునరాలోచించాలి” అని కోరారు. దేవాలయాలు వ్యాపార కేంద్రాలు కాదని, అవి భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని ఆయన పేర్కొన్నారు. ఇతర మత ప్రార్థనా స్థలాల విషయంలో ఇలాంటి పరిస్థితులు కనిపించకపోతే, హిందూ దేవాలయాలపై మాత్రమే పన్నుల భారం పడుతోందనే భావన భక్తుల్లో కలుగుతోందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం హిందుత్వ పేరుతో రాజకీయాలు చేసే బిజెపి నాయకులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని గాదె శివ సూచించారు. హిందూ భక్తుల మనోభావాలను గౌరవిస్తూ దేవాలయాలపై జీఎస్టీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# గౌతమ్‌నగర్ ఓటర్ల సమస్యపై అధికారులను కలిసిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**కూకట్ పల్లి, మే 9 (ప్రభాత ఉదయం)**




మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్, పైప్‌లైన్ రోడ్డు ప్రాంతానికి సంబంధించిన 16 పోలింగ్ బూత్‌లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వెరిఫికేషన్‌లో భాగంగా 2002 సంవత్సరం ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల తొలగింపునకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. 2002 ఓటరు జాబితాలో బూత్ నం. 351 నుండి 366 వరకు గల 16 బూత్‌లు లేకపోవడంతో ప్రస్తుతం గౌతమ్‌నగర్‌లో నివసిస్తున్న వేలాది మంది ఓటర్ల పేర్లు జాబితా నుండి గల్లంతయ్యాయి. ఈ విషయమై గౌతమ్‌నగర్‌వాసులతో కలిసి మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ గురువారం డిప్యూటీ కమిషనర్ డాక్యు నాయక్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ "గౌతమ్‌నగర్ కాలనీ ఉద్భవించినప్పటి నుండి ఈ ప్రజలందరూ ఇక్కడే స్థిర నివాసం ఉంటున్నారు. గత 20 ఏళ్లుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వీరి పేర్లు 2002 జాబితా పేరుతో తొలగించడం అన్యాయం. ఓటు హక్కు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ 16 బూత్‌లను పునరుద్ధరించి, ప్రజలకు ఓటు హక్కు కల్పించాలి" అని డీసీ ని కోరారు. దీనిపై స్పందించిన డీసీ, "ఈ అంశం జోనల్ కమిషనర్ పరిధిలోనిది. జోనల్ కమిషనర్ తో చర్చించి, నిబంధనల ప్రకారం సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో అడ్వకేట్ మసూద్, సలావుద్దీన్, జహీర్, నషా ఖాన్, ఖలీల్, కలీం, జావేద్, జాఫర్ తదితరులు పాల్గొనారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి

**కొత్తకోట, మే 9(ప్రభాత ఉదయం)**

కొత్తకోట పట్టణ కేంద్రంలో బి పి ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన తాసిల్దార్ సూర లక్ష్మి నాగరాజు  దంపతుల కుమారుడు రఘు వంశీ వివాహం గాయత్రి తో జరిగింది. ఈ పెళ్లి వేడుకలో మాజీ జెడ్పిటిసి డాక్టర్ పి జె బాబు, సీనియర్ జర్నలిస్ట్ ఏ శ్యాంసుందర్ రెడ్డి ,వల్లూరు మురళీధర్ రెడ్డి, పెంటన్న యాదవ్ ,నీలవర్ధన్ రెడ్డి, శంకర్ యాదవ్ ,బాలరాజు, వెంకటేష్ ఆచారి లు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# గంగనపల్లి చెరువు వద్ద ఘనంగా 'రైతు వారోత్సవం'

**నీటి తుమ్మ మొక్కల తొలగింపు పై రైతులకు అవగాహన**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 9(ప్రభాత ఉదయం)**

రైతు వారోత్సవాలలో భాగంగా కేటిదొడ్డి మండల వ్యవసాయ శాఖ, నీటి పారుదల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గంగనపల్లి చెరువు వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చెరువులో విస్తరించి ఉన్న నీటి తుమ్మ  మొక్కలను అధికారులు, రైతులు కలిసి శ్రమదానంతో తొలగించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజవర్దన్ రెడ్డి, నీటి తుమ్మ మొక్కల వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి తుమ్మ మొక్కలు విపరీతంగా పెరగడం వల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందన్నారు. ఈ మొక్కల కారణంగా నీటిలో ఆక్సిజన్ తగ్గి చేపల పెంపకానికి ఆటంకం కలుగుతుంది అని సాగునీటి సరఫరా కాలువల్లో ఈ మొక్కలు అడ్డుపడి, పొలాలకు నీరు అందకుండా చేస్తాయి అని పేర్కొన్నారు. చెరువులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నీటి నాణ్యత మెరుగుపడటమే కాకుండా, సాగుకు ఎంతో మేలు జరుగుతుందని  వివరించారు. భవిష్యత్తులోనూ రైతులు నీటి వనరుల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ), ఏఈఈ, వ్యవసాయ విస్తరణాధికారి, వర్క్ ఇన్‌స్పెక్టర్, గంగనపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఒడుదుడుకుల్లో పత్తి విత్తనాల రైతులు

**మార్కెటింగ్ లేక పత్తి సాగును తగ్గిస్తున్న ప్రధాన కంపెనీలు**

**ప్యాకెట్ ధర ఎక్కువ ఉండటంతో పక్క రాష్ట్రానికి తరలిపోతున్న సీడ్ పత్తి**

**ప్రత్యామ్నాయంగా నకిలి పత్తి వితనాలకు డిమాండ్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 9(ప్రభాత ఉదయం)**

పేరెన్నిక కల్గిన పత్తి విత్తనాలను అందించడంలో నడిగడ్డ ప్రాంతం రాష్ట్రంలోనే పేరుగాంచింది. దశాబ్దాల కాలం నుంచి ఆహార పంటలతో సహా ఏ పంట వేసినా వేయకపోయినా సీడ్ పత్తిని కచ్చితంగా సాధారణ విస్తీర్ణానికి తగ్గకుండా రైతులు వేసేవారు. పలు మార్లు నార్మల్ కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన సందర్భాలున్నాయి. తొలకరి వాన పడితే చాలు పత్తి విత్తనాలు విత్తేవారు. నడిగడ్డలో సుమారు 50 వేల ఎకరాలలో సీడ్ పత్తి సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణ పరంగా చూస్తే మొదటి స్థానం పత్తిదే. ఆ తర్వాతే వరి,  వేరుశనగ పంటల సాగు కు ప్రాధాన్యం ఇస్తున్నారు. నడిగడ్డ రైతులు పత్తి పంట తప్ప తమకు ఏ పంట కలిసి రావడం లేదని నమ్మకంతో ఉన్నారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం వల్ల పత్తి పంట ఆశించినంతగా చేతికందడం లేదు. దానికి తోడు పత్తి విత్తనాల ప్యాకెట్ ధరలను ఆశించిన స్థాయిలో ఇవ్వకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకపోతుంది. సంప్రదాయంగా పత్తి సాగు చేసే ప్రాంతాలే కాకుండా కొత్త చోట్లకు సీడ్ కంపెనీలు సాగు విస్తరించడం, ఎన్నడు లేని విధంగా సీడ్ పత్తి విత్తనోత్పత్తి అధికంగా ఉండటంతో పలు కంపెనీలు మార్కెటింగ్ లేక ఆర్గనైజర్లకు, సీడ్ రైతులకు సీడ్ పత్తి విత్తనాలు ఇవ్వడం లేదంటున్నట్లు వినికిడి. అలాగే సీడ్ పత్తి ప్యాకెట్ ధర ఎక్కువగా ఉండటం కర్ణాటకలో సీడ్ పత్తి ప్యాకెట్ ధరలు తక్కువగా ఉండటంతో ప్రధాన సీడ్ కంపెనీలు ఆ ప్రాంతాన్ని తరలివెళ్తున్నట్లు సమాచారం. దీంతోవాణిజ్య పంటల్లో ప్రధానమైనదిగా, తెల్లబంగారంగా రైతులు పిలుచుకునే ఈ పంట రెండేళ్ల నుంచి బాగా తగ్గుతోంది. గత మూడు సంవత్సరాల నుంచి సీడ్ పత్తి కంపెనీలు నడిగడ్డ నుంచి తరలిపోతుండటంతో సీడ్ పత్తి రైతులు ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు పేరుగాంచిన సీడ్ పత్తి కంపెనీలు పత్తి విత్తనాలు ఇవ్వడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. గద్వాల రైతాంగం ఎదుర్కొంటున్న ఈ ఒడుదుడుకులను అధిగమించాలంటే తెలంగాణ ప్రభుత్వ జోక్యం అవసరం. విత్తన ధరల నియంత్రణ, కంపెనీలకు-రైతులకు మధ్య సయోధ్య, మరియు నకిలీ విత్తనాల అరికట్టడం వంటి చర్యలు తీసుకుంటేనే నడిగడ్డ పత్తి విత్తన రైతాంగానికి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది.



**సీడ్ పత్తి కంపెనీలు**

గద్వాల జిల్లా పరిధిలో సీడ్ పత్తి కంపెనీలు అనేకం. వేద, రాసి, కావేరి, నూజివీడు, అంకూర్, జెకె, రాయల్, టాటా, కోహినూర్, సాయి, భవ్య, వసంత, పాలమూరు, శ్రీరామ, నీద్ గంగా యశోద, సూపర్ ఇండో, అమెరిక, ధనలక్ష్మి లాంటి కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. వీటి పరిధిలో ఆర్గనైజర్లు పనిచేస్తున్నారు. సాగు విస్తీర్ణం తగ్గుదల

ఒకప్పుడు 50,000 ఎకరాల్లో సాగయ్యే సీడ్ పత్తి, గత రెండేళ్లుగా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. వాణిజ్య పంటగా లాభసాటిగా ఉండాల్సిన "తెల్ల బంగారం", నేడు రైతుకు భారంగా మారుతోంది.

**మార్కెటింగ్ సవాళ్లు - కంపెనీల వెనకడుగు**


గతంలో ఎన్నడూ లేని విధంగా సీడ్ పత్తి విత్తనోత్పత్తి అధికం కావడం, నిల్వ ఉన్న విత్తనాలకు తగిన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో కంపెనీలు సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటున్నాయి. దీనివల్ల కంపెనీలు నమ్మకమైన ఆర్గనైజర్లకు మాత్రమే కొంతమేర సీడ్ పత్తి విత్తనాలు ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో వందల ఎకరాల్లో సీడ్ ఇచ్చే ఆర్గనైజర్లకు ప్రధాన కంపెనీలు మొండి చేయి చూపించే అవకాశం కనిపిస్తోంది.

**అంతర్రాష్ట్ర ధరల వ్యత్యాసం**

తెలంగాణ (గద్వాల) ప్రాంతంతో పోలిస్తే కర్ణాటక వంటి పక్క రాష్ట్రాల్లో సీడ్ పత్తి ప్యాకెట్ ధరలు తక్కువగా ఉండటం పెద్ద దెబ్బగా మారింది. ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడానికి ప్రధాన కంపెనీలు తమ కార్యకలాపాలను పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నాయి. ఇది స్థానిక ఉపాధిని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది.

**నకిలీ విత్తనాల బెడద**

ప్రధాన కంపెనీలు విత్తనాలు ఇవ్వకపోవడం, సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా నకిలీ విత్తనాల వైపు మొగ్గు చూపే ప్రమాదం ఉంది. దీనివల్ల పెట్టుబడి నష్టపోవడమే కాకుండా, భూసారం మరియు పంట దిగుబడిపై దీర్ఘకాలిక ప్రభావం పడుతుంది.



# కార్మిక నాయకుడు రవిని సన్మానించిన యూనియన్ నాయకులు

**కూకట్ పల్లి, మే 9 (ప్రభాత ఉదయం)**

హైదర్ నగర్ లో భవన నిర్మాణ కార్మికులు నూతన యూనియన్ ఏర్పడ్డ సందర్భంగా బి ఆర్ టి యు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిని యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు..ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని అన్నారు. నిరంతరం కార్మికులు పక్షాన తాను ఉంటానని అన్నారు. సహకరిస్తున్న కార్మికులకు నాయకులకు ధన్యవాదములు తెలిపారు..ఈ కార్యక్రమం లో కార్మిక నాయకులు, అనిల్, సుదర్శన్, జగన్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.



# విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు,మే 9 (ప్రభాత ఉదయం):**

తెల్లాపూర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల సేవలు అత్యంత ప్రశంసనీయమని,వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని  అన్నారు. శనివారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలో గల శ్రీ శ్రీ శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.  ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు.  ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, మల్లారెడ్డి, దేవేందర్ యాదవ్, లచ్చి రామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**కూకట్ పల్లి, మే 9 (ప్రభాత ఉదయం)**

సచివాలయంలో శనివారం తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బండి రమేష్ ని కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైనందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ భేటీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూల బొకే అందజేసి, శాలువాతో సన్మానించి బండి రమేష్ ను ఘనంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా సమాజానికి తగిన సేవలు అందించాలని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కమ్మ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సహకారంతో పేద కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విధంగా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో కార్పొరేషన్ కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. అవసరమైన ప్రతి సహకారాన్ని ప్రభుత్వం తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బండి రమేష్  మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, కమ్మ సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, కాంగ్రెస్ నాయకులు, అనుచరులు బండి రమేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608